VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత ఐదు సంవత్సరాల నుండి నిరంతరాయంగా వెలువడుతున్న
'విభారె' తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ లోని అన్ని జిల్లా కేంద్రాలో
బ్యూరోలు మరియు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గ మరియు
మండలాల వారీగా విలేఖరులు కావలెను
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
8143193697, 9440232308

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 07-04-2023 సంపుటి : 04 సంచిక : 192 పేజీలు : 4 వెల : రూ 3-00

## ఇక ఇంటికే డాక్టర్..ఉచితంగా మందులు

**ఫ్యామిలీ డాక్టర్ కాన్సెపట్ ప్రారంభం**

**దేశానికి ఆదర్శం కాబోతుందని సిఎం జగన్ వెల్లడి**




పల్నాడు,ఏప్రిల్6: ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లోకి వచ్చింది. జిల్లాలోని చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం ప్రారంభి ంచారు. అనంతరం బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ.. పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది కూడదు. ప్రతీ ఒక్కరికీ భరోసా కల్పిస్తున్న పథకం ఇది. గ్రామాల్లో ఉచితంగా ఆధునిక వైద్యం అందించే పథకం. డాక్టర్ల కోసం ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేదు..డాక్టర్లే మీ ఇంటి దగ్గరకు వస్తారని అన్నారు. మందులు కూడా ఉచితంగా అందించే..గొప్ప కాన్సెప్ట్.. ఫ్యామిలీ డాక్టర్ పథకం అన్నారు. పెన్షన్లు ఏవిధంగా మీ ఇంటికే వస్తున్నాయో అదే విధంగా డాక్టర్ మీ ఇంటికొస్తాడు. దేశం మొత్తం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను కాపీ కొడతారు. ప్రతి ఒక్కరికి రక్షణ కవచంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నిలబడుతుంది. పేదవాడి ప్రాణాలు గాల్లో దీపం అన్న నానుడి మార్చిన ఘనత వైఎస్ దే అని ఈసంద ర్భంగా తెలిపారు.. ఆరోగ్యశ్రీని పద్ధతి ప్రకారం నీరు గార్చారు. వెయ్యి జబ్బులకు మాత్రమే కట్టడి చేశారు.నెట్ వర్క్ ఆసుపత్రులకు రూ. 800 కోట్లు బకాయిలు పెట్టారు .ఈ ప్రభుత్వంలో రూ. 9000 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాం. వైద్య ఆరోగ్య శాఖలో 48,639 ఉద్యోగాలిచ్చాం. గతానికి ప్రస్తుతానికి తేడా చూడండి. వందకి వంద శాతం ఖాళీలు భర్తీ చేశాం' అని సీఎం జగన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ మంత్రి విడదల రజని తదిత రులు పాల్గొన్నారు. కార్యక్ర మాన్ని జిల్లాల్లో మంత్రులు ప్రారంభించారు.

## దేశహితమే మన అభిమతం

**దేశం కోసం బిజెపి కలలు కంటోంది**

**అత్యున్నత స్థాయిలో నిలిపేందుకు యత్నం**

**అవినీతి, వంశపారంపర్య రాజకీయాలకు కాలం చెల్లింది**

**కాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను చరిత్ర కింద మార్చేశాం**

**హనుమంతుడి స్ఫూర్తిగా నేను చేయగలను అన్న దీక్ష తీసుకోవాలి**

**పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మోడీ పిలుపు**

**దేశప్రజలకు ప్రధాని హనుమత్ జయంతి శుభాకాంక్షలు**



న్యూఢిల్లీ,ఏప్రిల్6 : హనుమాన్ చేయలేనిది అంటూ ఏదీ లేదని.. అలాగే బీజేపీ కార్యకర్తలు కూడా తలచుకుంటే ఏదైనా సాధించగలరని ప్రధాని మోడీ అన్నారు. హనుమాన్ మాదిరిగానే పార్టీ కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని సూచించారు. పేదలకు సామాజిక సేవ, న్యాయం చేయటమే బీజేపీ విధానం అని.. ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలకు నిరంతరం సేవ చేస్తుందని కీర్తించారు. పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ కార్యకర్తలు, నేతలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందేశం ఇచ్చారు. గురువారం ఉదయం ఆయన ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో ప్రసంగించారు. హనుమాన్ జయంతి ఇదే రోజు కావటంతో.. దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలోని కాంగ్రెస్, ఇతర పార్టీలు తమ విధానం ఏంటో తెలియకుండానే.. బీజేపీపై ఆరోపణలు, విమర్శలు చేస్తున్నాయని.. అందుకే వారి అడ్రస్ గల్లంతు అయ్యిందన్నారు. దేశం కోసం బీజేపీ పెద్ద పెద్ద కలలు కంటుందని.. వాటిని సాకారం చేసి దేశాన్ని ప్రపంచంలోనే అత్యున్నత స్థాయిలో నిలబట్టటం కోసం అకుంఠిత దీక్షతో పని చేస్తున్నామన్నారు. దేశంలో అవినీతిపై యుద్ధాన్ని హనుమంతుడి తరహా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మిషన్ 2024 ప్రారంభించారు. రాబోయే ఎన్నికల ద్వారా దేశ ప్రజల కలలను సాకారం చేసే విధంగా కృషి చేయాల్సి ఉందన్నారు. దేశంలో అవినీతిపైనా, వంశపారంపర్య రాజకీయాలపైనా పోరాడేందుకు భారతీయ జనతా పార్టీకట్టుబడి ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. బీజేపీకి అన్నిటి కన్నా దేశమే ముఖ్యమని చెప్పారు. ఆ పార్టీ 43వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ ఎంపీలను ఉద్దేశించి గురువారం ఆయన మాట్లాడారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, శాంతిభద్రతల సవాళ్ల నుంచి దేశాన్ని విముక్తి చేయడం కోసం బీజేపీ నిబద్ధతతో కృషి చేస్తోందన్నారు. బీజేపీకి సర్వస్వం దేశమేనని చెప్పారు. అవినీతిపైనా, వంశపారంపర్య రాజకీయాలపైనా పోరాడేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. రామభక్త హనుమంతుని మాదిరిగా భారత దేశం నేడు తన శక్తి, సామర్థ్యాలను తెలుసుకుంటోందన్నారు. అవినీతి, శాంతిభద్రతల సమస్యలపై పోరాడేందుకు బీజేపీ ఆంజనేయుడి నుంచి స్ఫూర్తిని, ప్రేరణను పొందుతోందన్నారు. భక్తాంజనేయుడి జీవితాన్ని పరిశీలించినపుడు, 'నేను చేయగలను' అనే వైఖరితో ఆయన వ్యవహరించారని తెలుస్తుందన్నారు. అన్ని రకాలుగా ఆయన విజయం సాధించడానికి కారణం ఇదేనని తెలిపారు. హనుమంతుడు ఏ పనినైనా చేయగలడని, ఆయన ఏ పనినైనా అందరి కోసం చేస్తాడని, తన కోసం తాను మాత్రం ఏదీ చేసుకోడని అన్నారు. హనుమంతుడు పాటించిన విలువలు, ఆయన బోధనల నుంచి బీజేపీ, దాని కార్యకర్తలు నిరంతరం ప్రేరణ పొందుతారని చెప్పారు. సముద్రమంతటి సవాళ్ళనైనా ఎదుర్కొనేంత బలంగా భారత దేశం ఎదిగిందని చెప్పారు. హనుమాన్ జయంతి సందర్భంగా అందరినీ దీవించాలని ఆయనను ప్రార్థిస్తున్నానని తెలిపారు. రాచరికపు ఆలోచనా ధోరణిగలవారు పేదలను, వెనుకబడిన వర్గాలవారిని, హక్కులను పొందలేనివారిని 2014 నుంచి అవమానిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు కుటుంబ, కులతత్వవాదులని దుయ్యబట్టారు. భారత దేశం సాధిస్తున్న అభివృద్ధిని తక్కువ చేసి చూపుతున్నారని తెలిపారు.

## జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

**నేటి నుంచి వైఎస్సార్ పార్టీ మెగా పీపుల్స్ సర్వే**

**ప్రజలను కలసి జగన్ సందేశం వినిపిస్తాం**

**14 రోజుల్లో 7 లక్షల మంది పార్టీ సైనికుల కృషి**

**ప్రభుత్వ కార్యక్రమాలను వివరించి ఓటు అడుగుతారు**

**వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడి**



అమరావతి,ఏప్రిల్6 : 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమా నికి ఏర్పాట్లు పూర్తి చేశామని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం నుంచి రాష్ట్రంల ఈ కార్యక్రమం ప్రారంభం కానుంద న్నారు. సీఎం జగన్ నేతృత్వం లోని వైఎస్‌ఆర్‌సీపీ 'జగనన్నే మా భవిష్యత్తు' అనే పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభి చనుంది. ఇందులో భాగంగా పార్టీ అత్యంత విస్తృతంగా అందరినీ కలుపుకొని 'మెగా సర్వే' చేస్తుందని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యాచరణ వివరిస్తూ తాడేపల్లి పార్టీ కార్యాల యంలో జరిగిన విలేకరుల సమావేశం లో సజ్జల రామకృష్ణా రెడ్డి మాట్లాడారు. మమ్మల్ని మా జగన్ అన్న పంపారని చెప్పి పది నిమిషాలు మాట్లాడతారు. జగన్ ఇచ్చిన మెసేజ్ వారికి అందించి వెళ్తారు. అన్ని కులాలు, మతాలు, ఇతర రాజకీయ కుటుంబాలను కూడా కలుస్తారు. గతంలో పాలన ఎలా జరిగింది? ఇప్పుడు ఎలా జరుగుతోందో? వారి అభిప్రాయాలు తీసుకుంటారు. దేశంలో ఎవరూ చేయని కార్యక్ర మం మేము చేస్తున్నాం. మీకు ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ సాయం అందితేనే తనకు ఓటేయమని జగన్ అంటున్నారు. ప్రపంచంలో ఎవరూ ఇలా ధైర్యంగా అడగలేరు.ఏ నెలలో ఏ సంక్షేమం అందించబోతున్నది కూడా అసెంబ్లీ సాక్షిగా సీఎం ప్రకటించారు. అప్పట్లో జన్మభూమి కమిటీ జలగలు ప్రజల్ని పీడిం చాయి. ఇప్పుడు లంచాలు లేకుండా అర్హతే ప్రమాణంగా సంక్షేమం అందిస్తున్నాం. గృహ సారథులు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లినప్పుడు ఐదు ప్రశ్నలు వేస్తారు. వారి నుండి జగన్ పాలనపై అభిప్రాయాలు తెలుసుకుంటారని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 7 లక్షల మంది పార్టీ సైనికులు 14 రోజుల్లో అంటే ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 20 వరకు రాష్ట్రంలోని 1.6 కోట్ల కుటుం బాలను.. 5 కోట్ల మంది ప్రజలను కలిసి 'మెగా సర్వే' చేయనున్నారని సజ్జల చెప్పారు. ఈ 7 లక్షల మంది కార్యక ర్తల్లో కొత్తగా నియమించబడిన గృహ సారథి, వార్డు సచివాలయం కన్వీన ర్లు ఉంటారు. వీరు ఇంటింటికి 'మెగా సర్వే' నిర్వహించే బాధ్యతను కలిగి ఉంటారు. ఈ సైనికులం దరూ గత 3-4 నెలలుగా పార్టీ కేంద్ర కార్యాలయం, ప్రాంతీయ సమన్వయకర్తలతో పాటు ఎమ్మెల్యే లతో నేరుగా సంప్రదింపులు జరిపారు.. అంతేకాకుండా, మం డలాల వారీగా శిక్షణ పొందారు, అక్కడ వారికి సమర్థవంతంగా పబ్లిక్ కనెక్షన్‌ను ఎలా నిర్వహించాలో నేర్పించారు' అని సజ్జల తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు ముఖ్యమైన అంశాలు ఉన్నాయని సజ్జల వివరిం చారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి పోలికకు సంబంధించిన కరపత్రంలో ఉండే పలు ముఖ్య విషయాలు సజ్జల చెప్పారు. వైసీపీ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోంది. కుల, మత, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా లబ్దిదారులకు సంక్షేమ పథకాల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తోంది. తద్వారా సంక్షేమ పథకాల అమలులో మధ్యవర్తులు, అవినీతికి తావు లేకుండా చేసింది. ప్రజలు జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చేవారు. ఈ పరిస్థితిని వైఎస్సార్ సీపీ పూర్తిగా మార్చివేసి ంది. మన బడి నాడు - నేడు కార్యక్రమం ద్వారా జగనన్న ప్రభు త్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దింది.

## ఆర్-5 జోన్ వ్యవహారం.. సుప్రీంను ఆశ్రయించిన అమరావతి రైతులు

దిల్లీ: ఆర్-5 జోన్ వ్యవహారంపై అమరావతి ప్రాంత రైతులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రైతులు దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు.దీనిపై ఈనెల 14న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. 10న విచారణకు తీసుకోవాలని రైతుల తరఫున న్యాయవాది కోరగా.. ఆరోజు కేసుల జాబితా ఇప్పటికే తయారైందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. అందుకే ఈ పిటిషన్‌ను




14న విచారణకు తీసుకుంటామని చెప్పారు. అమరావతి రైతులు ఆర్-5 జోన్‌పై ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేదలకైనా రాజధాని అమరావతిలోని 900 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వీలుగా బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)లో మార్పులు చేస్తూ ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## వడ్డీరేట్లు పెంచుతారన్న ఊహాగానాలకు చెక్

**ఆర్‌బిఐ వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగింపు**

**ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన గవర్నర్ శక్తికాంత్ దాస్**

ముంబై,ఏప్రిల్6 : ఆర్థిక మాంద్యం ప్రభావంతో మళ్లీ వడ్డీ రేట్లు పెంచుతారనే వార్తలకు తెరదించుతూ..వడ్డీ రేట్లను యథాతథంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొనసాగించింది. గురువారం ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్



శక్తికాంత దాస్ వెల్లడించారు. వడ్డీ రేట్లు పెంచటం లేదని.. యథాయథంగా కొనసాగిస్తామని వివరించారు. రెపో రేటు యథాతథంగా ఉంచాలనే నిర్ణయాన్ని మానిటరీ పాలసీ కమిటీ లోని ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు సమర్థించినట్లు వెల్లడించారు. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఆర్బీఐ గత ఆర్థిక సంవత్సరం నుంచి రెపో రేట్లు పెంచుతూ వస్తోంది. 2022 ఆర్థిక సంవత్సరంలో.. ఆర్బీఐ రెపోరేటును ఆరు సార్లు పెంచింది. ఈ సారి కూడా ధరలు అధికంగా ఉండటం.. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం భయాలు ఉండటంతో.. మళ్లీ వడ్డీ రేట్లు పెంచుతారని అందరూ భావించారు. అయితే అలాంటి నిర్ణయం ఏమీ తీసుకోలేదంటూ దేశ ప్రజలకు ఊరటనిచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయంతో హోం లోన్, పర్సనల్ లోన్ తోపాటు బ్యాంక్ అప్పులు తీసుకున్న వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈసారికి వడ్డీ రేట్లలో మార్పు లేకపోవటం గుడ్ న్యూస్ గా చెబుతున్నాయి వ్యాపార వర్గాలు.

## ఫారెస్టు భూములలో అక్రమ తవ్వకాలు

**వైకాపా నేతలపై దేవినేని మండిపాటు**

విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కొత్తూరు, తాడేపల్లి లో ఫారెస్ట్ అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలను తెదేపా నేత మాజీ మంత్రి దేవినేని ఉమా పరిశీలించారు. దేవినేని మాట్లాడుతూ వైసీపీ నేతలు ఫారెస్ట్ భూములు పేద రైతుల వద్ద అసైన్డ్ భూములను బెదిరించి లాక్కుని అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. గ్రామస్తులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన స్పందించలేదు అధికారులు ఫోన్లు ఎత్తలేదు దొంగలకు రాసి ఇచ్చేశారు దోచుకోమని అని ఆరోపించారు. పంచభూతాలను దోపిడీ చేస్తున్నారు వీళ్లను తరిమి తరిమికొట్టే రోజు దగ్గరలోనే ఉంది. పోలీసు రెవెన్యూ ఫారెస్ట్ ఇరిగేషన్ అన్ని శాఖలు మూసుకుని కూర్చున్నారు. వందల లారీలు ఆపిన, గ్రామస్తులు ఎన్నిసార్లు ఆపినా నో పోలీస్ .. కలెక్టర్, సబ్ కలెక్టర్ రావడానికి తీరికలేదు. విజయవాడలో మగధ లే అవుట్లో లక్షల ట్రిప్పులు పోశారు. బుడమేరు వంతెన కోసం పోసిన మట్టి పోలవరం కాలవ రక్షణ కట్టగా ఉన్న మట్టిని పందికొక్కుల దోచేశారు. దొంగలు దుష్టులు దరిద్రులు అశుద్ధం తినేవారు అంతా కలిసి దోపిడీ చేశారు ఈ దుర్మార్గులు ఎంతకైనా తెగిస్తారు వీళ్ళని శిక్షించి జైల్లో పెట్టాలి. వెలగలేరు, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద్, నైనవరం, సూరంపల్లి, నున్న, పాతపాడు కండ్రిక గ్రామాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు.ముఖ్యమంత్రి బంధు వర్గం కడప జిల్లా అనుచరులు ఉన్నారు. ఇరిగేషన్ మంత్రి రాంబాబు అనుచరులు, చిత్తూరు జిల్లా మంత్రి అనుచరులు, ఎమ్మెల్యే బంధువులు వాళ్ళ అనుచరులు ఎమ్మెల్సీ అనుచరులు పక్క జిల్లా ఎంపీ అనుచరులు పందికొక్కుల్లా దోచుకు తింటున్నారు. స్పందనకు స్పందన లేదు ముఖ్యమంత్రికి ఎన్నోసార్లు సామాజిక మాధ్యమాల ద్వారా పెట్టినా ఫలితం శూన్యం. కొండపల్లి అడవిని కొట్టేశారు బూడిద దోచుకు తింటున్నారు కోట్లు దండుకుంటున్నారు పోలవరం మట్టి అమ్ముకోవటమే కాకుండా పోలవరం గట్లను కూడా ప్రశ్నార్థకం చేశారని అన్నారు.నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కూడా దీనిని విచారణ చేస్తుంది. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఎన్ని వందల పెనాల్టీలు పడతాయో మొత్తం ఖజానాకు రావాలి. ఎవరైతే దోపిడీ కార్యక్రమాలకు భాగస్వాములయ్యా అయ్యారో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి, ఎంపీ వారి అనుచరులు ఎవరైనా కానీ అందరూ శిక్షార్హులేనని అన్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 07-04-2023

## పదేళ్లలో రెట్టింపు పెరుగు, తరుగు...

బంగారంలో పెట్టుబడి పెట్టినోళ్లు 10 ఏళ్లలో రెట్టింపు కాగా.. అదే రూపాయి విలువ మాత్రం 10 ఏళ్లలో రెట్టింపు స్థాయిలో దిగజారింది.బంగారం ప్రకాశం రోజురోజుకూ పెరుగుతోంది. బంగారం ధరలు కొత్త రికార్డులు సృష్టించేందుకు ఆసక్తిగా ఉరకెలత్తుతున్నాయి. 2023 మార్చి మూడో వారంలో, బంగారం మొదటిసారిగా 10 గ్రాములకు రూ. 60,000 దాటింది. ఏప్రిల్ నెలలో రూ. 61,000 దాటింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితి క్షీణిస్తుందన్న సంకేతాలు కనిపిస్తుండడంతో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. పెరుగుతున్న బంగారం ధరలకు రెండు వైపులా పదును ఉంది. బంగారంపై ఇన్వెస్ట్ చేసిన వాళ్లు తమ పెట్టుబడిపై ఇప్పటికే అద్భుతమైన లాభాలు పొందుతున్నారు. రాబోయే పెళ్లిళ్ల సీజన్ కోసం నగలు కొందామని భావిస్తున్న వాళ్ల జేబుకు చిల్లు పడుతోంది.ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్‌లో ఒడుదొడుకులు కనిపిస్తున్నాయి, కమొడిటీల ధరల్లో భారీ హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి విదేశీ పెట్టుబడిదార్లు ప్రయత్నిస్తున్నారు. ఆ డబ్బును బంగారంలోకి మళ్లించడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ఎప్పుడు తారుమారైనా, సురక్షిత పెట్టుబడి మార్గమైన బంగారంలోకే పెట్టుబడులు వెళ్తుంటాయి. 10 ఏళ్లలో, బంగారంపై ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లు భారీగా లాభపడ్డారు. గత దశాబ్ద కాలంగా బంగారం ధరల గమనాన్ని పరిశీలిస్తే, సరిగ్గా 10 సంవత్సరాల క్రితం, 2013లో, స్వచ్ఛమైన పసిడి 10 గ్రాములకు దాదాపు 29,000 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. ఆ తర్వాత రెండేళ్లలో, 2015లో ధరలు కాస్త మెత్తబడి 10 గ్రాముల ధర రూ. 26,000కు తగ్గింది. ఇక అప్పటి నుంచి బంగారం ధరలు వెనుదిరిగి చూడలేదు. బంగారం ధర 2018లో రూ. 31,000, 2019లో రూ.35,000, 2020లో రూ.48,000, 2022లో రూ.52,000, ఇప్పుడు 10 గ్రాములు రూ.61,000 పైన ట్రేడవుతోంది. 2022 డిసెంబర్ 30 చివరి ట్రేడింగ్ రోజున, బంగారం ధర రూ. 54,790. అప్పుడు బంగారంపై ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లకు ఇప్పుడు 10 శాతం కంటే ఎక్కువ రాబడి, లేదా 10 గ్రాములకు రూ.6,300 లభించింది. 2022 ప్రారంభంలో బంగారం 10 గ్రాముల రేటు 47,850 రూపాయలు. ఈ 15 నెలల్లోనే బంగారం 10 గ్రాములకు 27.50 శాతం లేదా రూ.13,150 లాభం ఇచ్చింది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక దాడి, ప్రపంచ ఆర్థిక సంక్షోభం, ద్రవ్యోల్బణం, ఖరీదైన వడ్డీ రేట్లు కనిపించాయి. 2022లో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లలో భారీ క్షీణత కనిపించింది. కానీ బంగారంపై పెట్టుబడి పెట్టినవాళ్లను ఆ లోహం ధనవంతులను చేసింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం బంగారం పెరుగుదల ఇక్కడితో ఆగదు. 10 గ్రాముల బంగారం ధర రూ.65,000 వరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. బంగారం మాత్రమే కాదు, గ్లోబల్ కరెన్సీ డాలర్‌ను కొనుగోలు చేసి తమ వద్ద ఉంచుకున్న వాళ్లు కూడా విపరీతమైన లాభాలు కూడా పొందాయి. 10 సంవత్సరాల క్రితం, డాలర్‌తో పోలిస్తే ఒక రూపాయి 54 స్థాయిలో ట్రేడవుతోంది. ఈ పది సంవత్సరాల్లో, రూపాయి మారకం విలువ భారీగా పడిపోయింది. ఈ కాలంలో, ఒక డాలర్‌తో రూపాయి మారకం విలువ 82 రూపాయల స్థాయికి తగ్గింది. అంటే, గత 10 ఏళ్లలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 51 శాతం క్షీణించింది. డాలర్ బలం కారణంగా భారతదేశ దిగుమతులు చాలా ఖరీదుగా మారాయి. బంగారం, ముడి చమురును భారతదేశం ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది, ఈ రెండింటి దిగుమతి కోసం ఎక్కువ డాలర్లు ఖర్చు చేస్తోంది.

# ఎటూ తేల్చుకోలేకపోతున్న పవన్



విజయవాడ, ఏప్రిల్ 6, ఆంధ్రప్రదేశ్‌లో జనసేన , బీజేపీ మధ్య పొత్తులు ఉన్నాయి. ఇది అధికారికం. కానీ కలిసి పని చేయడం లేదు. మీరు కలసి రావడం లేదంటే మీరు కలసి రావడం లేదని రెండు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. తిరుపతి ఉపఎన్నిక తర్వాత వచ్చిన అన్ని ఉపఎన్నికల్లోనూ జనసేన పోటీ చేయాలని తాము ప్రతిపాదించామన కానీ పవన్ కల్యాణ్ అంగీకరించలేదని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి చెబుతున్నారు. అయితే రాష్ట్ర బీజేపీ నేతల వ్యవహారశైలి తనకు అసలు నచ్చలేదని.. అసలు వారిని తాను పట్టించుకోవడంలేదన్నారు. కానీ బీజేపీ అగ్రనేతలకు తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందన్నారు. అందుకే ఏదైనా ఢిల్లీలో తేల్చుకుంటామనుకున్నారు. కానీ ఢిల్లీ వెళ్లిన పవన్‌కు రెండు రోజులు ఉన్నా ప్రధాని మోదీ కానీ.. హోంమంత్రి అమిత్ షా కానీ అపాయింట్‌మెంట్ ఇవవలేదు. దీంతో బీజేపీ అధ్యక్షుడు నడ్డా, ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మురళీధరన్‌తో చర్చలు జరిపి వచ్చేశారు. బీజేపీ అగ్రనేతలు తనకు ఎంతో ఆప్తులని.. పవన్ కల్యాణ్ చాలా సార్లు చెప్పారు. నిజానికి వారు ఎప్పుడూ పవన్ కల్యాణ్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. బీజేపీ తరపున ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోదీని ప్రకటించిన తర్వాత 2014లో అహ్మదాబాద్ వెళ్లి మోదీని కలిశారు పవన్ కల్యాణ్. అదే చివరి సారి. తర్వాత ఎన్నికల ప్రచారంలో.. ఇటీవల విశాఖకు వచ్చినప్పుడు పవన్ ను కలిశారు కానీ.. ఢిల్లీకి వెళ్లినప్పుడు మాత్రం ఎప్పుడూ కలవలేదు. తిరుపతి ఉపఎన్నికల్లో బీజేపీనే పోటీ చేసేలా ఒప్పించేందుకు ఢిల్లీ పిలిపించినప్పుడు ఓ సారి అమిత్ షా మాట్లాడారు. అంతే తప్ప ఏపీ రాజకీయాలపై చర్చిద్దామని వచ్చిన ప్రతీ సారి పవన్ కు నిరాశే ఎదురయింది. జాతీయ నేతలు రాష్ట్ర స్థాయిలో ఏ పార్టీతో అయినా పొత్తులు ఏర్పాటు చేసుకున్న తర్వాత ఇక వ్యవహారాలన్నీ రాష్ట్ర స్థాయిలోనే ఉండాలని చూసుకుంటారు. రాష్ట్ర నేతలతో సమన్వయం చేసుకుని బలపడాలని అనుకుంటారు. కానీ పవన్ కల్యాణ్ ఈ విషయంలో చొరవచూపలేదని బీజేపీ హైకమాండ్ భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. తిరుపతి ఉపఎన్నికల తర్వాత స్థానిక ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పని చేయలేకపోయాయి. ఆ తర్వాత తాము బీజేపీతో పొత్తు వల్ల నష్టపోయామని కొంత మంది జనసేన నేతలు మీడియా ఎదుట విమర్శలు చేశారు. ఇలాంటి పరిణామాలపై హైకమాండ్‌కు నివేదికలు వెళ్లడంతో... పవన్ విషయంలో ప్రయారిటీ తగ్గించుకున్నట్లుగా చెబుతున్నారు.పవన్ కల్యాణ్ ఎప్పుడూ అపాయింట్‌మెంట్లు అడగరు. మహా అయితే ఏడాదికోసారి అడుగుతారేమో. అదీ కూడా రాష్ట్ర రాజకీయాలపై చర్చించడానికే. తాను రిక్వెస్ట్ చేస్తే ప్రధాని అపాయింట్‌మెంట్ ఇస్తారన్న నమ్మకంతో గతంలో చేనేతల్ని ఢిల్లీకి తీసుకెళ్తానని పవన్ మాటిచ్చారు. కానీ అపాయింట్ మెంట్ గగనం కావడంతో ఆ హామీని నెరవేర్చలేకపోయారు. ఢిల్లీకి వెళ్తే బీజేపీలో టాప్ టు ఇద్దరూ అపాయింట్‌మెంట్లు ఇవ్వకపోవడంతో.. రాష్ట్ర బీజేపీ నేతల్ని తక్కువ చేసి.. తమ దగ్గరకు వస్తే తాము ఎందుకు ప్రాధాన్యం ఇస్తామన్న సంకేతాల్ని పంపినట్లయిందన్న వాదన వినిపిస్తోంది. పవన్ కల్యాణ్ , నాదెండ్ల మనోహర్ ఢిల్లీ పర్యటన సమయంలో ఏపీ బీజేపీ సోషల్ మీడియా టీం ఢిల్లీలోనే ఉంది. పవన్ కంటే ముందే వారితో జేపీ నడ్డా భేటీ అయ్యారు. రాష్ట్ర రాజకీయాలపైనా చర్చించారు. తర్వాత పవన్ తో నడ్డా భేటీ అయ్యారు. ఈ రెండు సమావేశాల తర్వాత ఏపీ బీజేపీ నేతలకు ఓ క్లారిటీ వచ్చింది. అదేమిటన్నది స్పష్టంగా చెప్పకపోయినా... తాము ఎవరినో ఓడించడానికి.. లేదో ఎవరినో గెలిపించడానికి రాజకీయాలు చేయడంలేదని.. తామే అధికారంలోకి రావాలనుకుంటున్నామని స్పష్టత ఇచ్చారు.ఎలా చూసినా పవన్ కల్యాణ్ విషయంలో బీజేపీ హైకమాండ్ తమ అసలైన రాజకీయాన్ని ప్రారంభించిందని అంటున్నారు. అయితే పవన్ మాత్రం ఎటూ తేల్చుకోలేక స్పష్టంగా ఓ దారిని ఎంచుకోలేకపోతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## టీమ్ బీ ముద్ర చెరిగిపోయేదెలా...

విజయవాడ, ఏప్రిల్ 6, ఏపీ బీజేపీ ఇరకాటంలో ఉందా? ఓ వైపు వైసీపీ, బీజేపీ ఒకటేనన్న అభిప్రాయం జనంలో ఉందన్న బాధ, అదే టైంలో వైసీపీ కనీసం తమను పట్టించుకోవడం లేదన్న అసహనంతో ఆ పార్టీ నాయకులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారా? నిన్న అమరావతిలో గొడవ జరిగి తమ పార్టీ నాయకుడు ఇబ్బందిపడ్డా? దానికి బీజేపీకి సంబంధం లేదని వైసీపీ నేతలు చెప్పడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందా? అధికార పార్టీ కనీసం తమను ఒక పక్షంగా గుర్తించడంలేదని ఏపీ కాషాయదళం కస్సుమంటోందా? నానాటికీ తీసికట్టు.. నాగంబొట్టు అన్నట్టుగా మారింది ఏపీ బీజేపీ పరిస్థితి. గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువగా అవమానకర రీతిలో ఓట్లను సాధించుకుంది. అభ్యర్థులందరూ డిపాజిట్స్ కోల్పోయారు. అయినా కేంద్రంలో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవడంతో ఏపీ బీజేపీ నేతల మాటలను ప్రజలు కాస్తో కూస్తో వింటున్నారు. ఈ క్రమంలో జనసేనతో పొత్తు పెట్టుకుంటే కచ్చితంగా బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగొచ్చనే అంచనాలకు విరుద్ధంగా పరిణామాలు చోటు చేసుకున్నాయి. జనసేనతో పొత్తులో ఉన్నా.. ఆ పార్టీ అంతా తూచ్ అన్నట్టుగా వ్యవహారం నడుస్తోంది. విడాకులు తీసుకునే ముందు భార్యా భర్తల మధ్య ఎంత సఖ్యత ఉంటుందో.. జనసేన-బీజేపీ మధ్య ఇప్పుడు అంతే సఖ్యత ఉందన్న చర్చ నడుస్తోంది. అందుకే జనంలోకి వెళ్లి.. సొంతంగా బలం పెంచుకునే ప్రయత్నాల మీద ఫోకస్ పెట్టింది ఏపీ బీజేపీ.సొంత బలం పెంచుకునే క్రమంలో 147 అసెంబ్లీ నియోజకవర్గాలకు కన్వీనర్లను.. కో-కన్వీనర్లను ప్రకటించింది ఏపీ బీజేపీ. వీరి ద్వారా పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెట్టారు ఏపీ బీజేపీ పెద్దలు. ఈ క్రమంలో ప్రజా పోరు రెండో విడత కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అలాగే జగన్ ప్రభుత్వం మీద ఛార్జ్ షీట్ వేసి.. గట్టిగా ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేద్దామని స్కెచ్ రెడీ చేసుకున్నారు నేతలు. ఈ విధంగా చేస్తే.. వైసీపీ-బీజేపీలు ఒకటేననే రీతిలో ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని పొగొట్టే ప్రయత్నం చేయొచ్చనేది బీజేపీ నేతల భావన. ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాభవం చెందడంతో కొందరు సీనియర్ నేతలు.. వైసీపీ-బీజేపీ ఒకటేననే భావన ప్రజల్లో బలంగా ఉందని.. అందుకనే తమను ప్రజలు నమ్మడం లేదని బహిరంగంగానే చెప్పేశారు. ఈ క్రమంలో ఈ తరహా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా తాము వైసీపీపై యుద్ధమే చేస్తున్నామని చెప్పుకోవచ్చని బీజేపీ ఏపీ నేతలు ఆలోచన చేశారు.వైసీపీ-బీజేపీ ఒకటేనన్న మచ్చను చెరిపేసుకునే క్రమంలో ఈ తరహా కార్యక్రమాలకు సిద్ధమవుతోంటే.. ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలు మాత్రం స్థానిక బీజేపీ నేతలను సంకటంలోకి నెట్టేస్తున్నట్టే కన్పిస్తోంది. ఢిల్లీలో సీఎం జగన్ ప్రభుత్వ పెద్దలను ఒకటికి రెండు సార్లు కలవడం.. భేటీలు నిర్వహించడం.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు.. సీపీఐ నేత నారాయణ వంటి వారు చేస్తున్న కామెంట్లు ఏపీ బీజేపీ నేతల్ని ఇరకాటంలో పెడుతున్నాయి. ఇవన్నీ చూస్తుంటే.. వైసీపీకి పూర్తిగా బీజేపీ హైకమాండ్ అన్ని రకాలుగా సహకరిస్తోందనే భావన ప్రజల్లోకి మరింతగా వెళ్లే ప్రమాదం ఉందనే చర్చ జరుగుతోంది.దీనికి తోడు అమరావతిలో జరిగిన పరిణామాలు బీజేపీ-వైసీపీ ఓ తాను ముక్కలేననే వాదనకు మరింత బలం చేకూర్చేలా ఉన్నాయి. తమపై వైసీపీ నేతలు దాడి చేశారని.. అరాచకం సృష్టించారని బీజేపీ మండిపడుతూ.. రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తే.. వైసీపీ మాత్రం బీజేపీకి క్లీన్ యూ సర్టిఫికెట్ ఇస్తోంది. తాము అసలు బీజేపీ మీద దాడి చేయలేదని.. చంద్రబాబు ప్రోద్బలంతో వచ్చిన.. ఆదినారాయణ రెడ్డి మనుషులే మూడు రాజధానుల టెంట్ మీదకు వచ్చి దాడి చేశారని వైసీపీ అంటోంది. ఇదే అంశాన్ని ఎంపీ నందిగం సురేష్ కూడా స్పష్టం చేస్తున్నారు. స్వతహాగా బీజేపీ ఇలాంటి దాడులకు పాల్పడదని.. చంద్రబాబు వెనుకుండి ఆదినారాయణ రెడ్డితో ఈ తతంగం నడిపించారనేది నందిగం సురేష్ మాటల సారాంశం. ఈ క్రమంలో దాడుల వంటి సంఘటనల్లో కూడా బీజేపీని తప్పు పట్టడానికి వైసీపీ ముందుకు రావడం లేదంటే.. కచ్చితంగా ఈ రెండు పార్టీలు ఒకటేననే అంశానికి మరింతగా బలం చేకూర్చినట్టు కాదా..? అనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

## సింహపురి నుంచి మరో అసమ్మతి గళం

నెల్లూరు, ఏప్రిల్ 6,ల్లూరులో రాజకీయాలు ఇప్పుడంతా వైసీపీ వర్సెస్ వైసీపీ అన్నట్టుగా సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 10కి 10 అసెంబ్లీ స్థానాలు సాధించినా కూడా పార్టీ పరిస్థితి ఇప్పుడు దారుణంగా తయారైంది. తాజాగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య.. సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఆసక్తికరంగా మారింది. తనపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్ట్ లు పెట్టారని, అలా పెట్టినవారికి సొంత పార్టీ నేతలు మద్దతు తెలపడం సరికాదని అంటున్నారాయన. ఆయన ఆవేదన ఇప్పుడు మరింత వైరల్ గా మారింది. ఇప్పటికే జిల్లాలో ఉన్న సమస్యలు చాలవన్నట్టు... ఇప్పుడు మరో ఎమ్మెల్యే పార్టీలో కలకలం రేపే వ్యాఖ్యలు చేయడం విశేషం. మంగపల్లి జ్యోతిష్ కుమార్‌రెడ్డి అలియాస్ బాబురెడ్డి అనే వ్యక్తి సూళ్లూరుపేట మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగి. కిలివేటి సంజీవయ్యే అతడికి ఉద్యోగం ఇప్పించారని అంటారు. అతడు శ్రీహరికోటకు చెందినవాడు. వైసీపీలో చురుకైన కార్యకర్త, కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నా కూడా ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థిస్తూ పోస్టింగ్ లు పెడుతుంటాడు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటాడు. ఇటీవల బాబు రెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో గొడవ మొదలైంది. తనను ఉద్యోగం నుంచి తొలగించిన తర్వాత బాబు రెడ్డి వాట్సప్ లో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఓ మెసేజ్ పెట్టాడు. అందులో స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను కూడా విమర్శించాడు. దీంతో ఆ మెసేజ్ వైరల్ గా మారింది. ఆ మెసేజ్ వైరల్ కావడం పోలీసుల వరకు వెళ్లింది. సూళ్లూరుపేట పోలీసులు బాబు రెడ్డిని స్టేషన్ కి తీసుకెళ్లి కొట్టారనే ఆరోపణలు వినపడుతున్నాయి. తనను పోలీసులు తీవ్రంగా కొట్టారంటూ బాబు రెడ్డి ఫొటోలు, వీడియోలను తిరిగి సోషల్ మీడియాలో అప్ లోడ్ చేశాడు. దీంతో ఈ వ్యవహారం మరింత ముదిరింది. వైసీపీ కోసం పనిచేసిన కార్యకర్త ఇలా పార్టీకి వ్యతిరేకంగా మారడంతో స్థానిక నాయకులు కలుగజేసుకున్నారు. చెంగాళమ్మ ఆలయం వద్దకు బాధితుడిని పిలిపించి మాట్లాడారు. బాబు రెడ్డిని కొట్టడం సరికాదంటూ చెంగాళమ్మ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి మండిపడ్డారు. దీంతో వ్యవహారం సంజీవయ్య వర్సెస్ బాబురెడ్డి మద్దతుదారులు అన్నట్టుగా మారింది. ఆ తర్వాత ఎమ్మెల్యే సంజీవయ్య వారి వద్దకు వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారట. తనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టింగ్ లు పెట్టిన వ్యక్తిపై ఎందుకు సానుభూతి చూపిస్తున్నారంటూ కోప్పడ్డారట. అయితే బాబురెడ్డికి సజ్జల వర్గం మద్దతు ఉన్నట్టు తెలుస్తోంది. సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు భార్గవ్ రెడ్డి.. బాబురెడ్డిని ఫోన్లో పరామర్శించారని తెలుస్తోంది. తిరుపతి ఎంపీ గురుమూర్తి కూడా ఫోన్లో పరామర్శించారని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం సంచలనంగా మారింది. స్థానిక వైసీపీ ఎమ్మెల్యేని విమర్శించిన వ్యక్తికి పార్టీ పెద్దలు సపోర్ట్ గా నిలిచారని ప్రచారం జరుగుతోంది. ఈ ఎపిసోడ్ లో సంజీవయ్య ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ కార్యకర్తని పోలీసులు కొట్టారనే విషయం కూడా సంచలనంగా మారింది

# అయ్యన్న అలక...



విశాఖపట్టణం, ఏప్రిల్ 6, డీపీ సీనియర్ నేత అయ్యన్న పాత్రుడు నేటి చంద్రబాబు సమావేశానికి హాజరవుతారా? డుమ్మా కొడతారా? ఇదే తెలుగుదేశం పార్టీలో చర్చ జరుగుతుంది. ఈరోజు విశాఖపట్నంలో టీడీపీ జోనల్ సమావేశం జరగింది. ఈ సమావేశాన్ని చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలిచిన తర్వాత మొదటి భేటీ కావడంతో విశేసం సంతరించుకుంది. ఇటీవల గంటా శ్రీనివాసరావు పార్టీలో యాక్టివ్గా మారినప్పటి నుంచి పార్టీ సినీయర్ నేత అయ్యన్న పాత్రుడు కొంత సైలెంట్ అయ్యారు. చంద్రబాబు తొలినాళ్లలో చెప్పిన విధంగా చేయడం లేదని ఆయన నొచ్చుకుంటున్నారని సమాచారం. మూడేళ్ల పాటు వైసీ?పీని ఎదిరించి, అనేక కష్టాలు పడిన తమ కుటుంబం కేసులను ఎదుర్కొనిందని, అయినా భయపడకుండా పార్టీ కోసం నిలబడిందని, కానీ గంటా శ్రీనివాసరావు మాత్రం మూడున్నరేళ్లు పార్టీకి, చివరకు శాసనసభకు కూడా దూరంగా ఉన్నా నాలుగో ఏడాది యాక్టివ్ కాగానే చంద్రబాబు దగ్గర తీయడం అయ్యన్న కొంత ఇబ్బందులకు గురయ్యారు. ఇక తొలి నుంచి కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఎలా ఉంటుందని అయ్యన్న పాత్రుడు సన్నిహితుల వద్ద ప్రశ్నించినట్లు తెలిసింది. అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావుకు తొలి నుంచి పడదు. ఆధిపత్య పోరు నడుస్తుంది. 2014 నుంచి 2019 వరకూ ఇద్దరూ చంద్రబాబు మంత్రివర్గంలో సభ్యులే. అయినా ఒకరిపై ఒకరు తరచూ విమర్శలు చేసుకునే వారు. పార్టీకి ఇబ్బంది కలిగించే వారు. అయినా చంద్రబాబు ఇద్దరూ సామాజికంగా, ఆర్థికంగా బలమైన నేతలు కావడంతో చూసీ చూడనట్లు వ్యవహరించారు. అయితే అయ్యన్న సీనియర్. పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి అయ్యన్న ఆ పార్టీలోనే ఉన్నారు. మధ్యలో ఎన్ని సంక్షోభాలు ఎదురైనా పార్టీ జెండా వీడలేదు. పార్టీనే నమ్ముకుని ఉన్నారు. పార్టీ జెండాను ఏనాడు వదిలిపెట్టలేదు. అందుకే అయ్యన్న తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ మంత్రివర్గంలో ఉంటారు. నమ్మకమైన నేతగా పార్టీలో గుర్తింపు పొందారు. 2029లో పదవీ విరమణ చేయాలనుకుంటున్నారు. తాను వచ్చే ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనుకుంటున్నారు. తనకుమారుడు విజయ్ను అనకాపల్లి పార్లమెంటు నుంచి బరిలోకి దింపాలని ప్రయత్నిస్తున్నారు. కానీ గంటా శ్రీనివాసరావు అలా కాదు. పార్టీలు మారి మారి టీడీపీలోకి వచ్చారు. సామాజికవర్గం, ధనం అండదండలతో ఆయన మంత్రిపదవి చేపడుతున్నారు. టీడీపీ, ప్రజారాజ్యం కాంగ్రెస్ పార్టీలకు వెళ్లి తిరిగి తెలుగుదేశం పార్టీలోకి వచ్చి సెటిల్ అయ్యారు. మొన్నా మధ్య ఆయన జనసేనలో చేరతారని ప్రచారం జరిగింది. వైసీపీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారని, కానీ అక్కడ అధినాయకత్వం గంటా డిమాండ్లకు అంగీకరించకపోవడంతో ఆయన టీడీపీలో కొనసాగుతున్నారని అయ్యన్న అనుచరులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ఎంతోకొంత నిజముందని టీడీపీ హైకమాండ్ కూడా నమ్ముతుంది. కానీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో గంటాకు స్పెషల్ ట్రీట్మెంట్ ఇవ్వాల్సి వస్తుంది. మాజీ మంత్రి నారాయణకు వియ్యంకుడు కావడం కూడా గంటాకు అదనపు బలం. అందుకే టీడీపీ అధినేత గంటాను తిరిగి దగ్గరకు తీసుకోవాల్సి వచ్చిందంటున్నారు. అయితే అయ్యన్న మాత్రం గంటా విషయంలో కొంత ఇబ్బందిగానే ఫీలవుతున్నారు. ఏం జరుగుతుందో చూడాలి. తాజాగా బుధవారం భేటీకి అయన అలా వచ్చి ఇలా వెళ్లిపోవడం చర్చానీయాంశమయింది.

## జలదీక్ష భగ్నం

నెల్లూరు, ఏప్రిల్ 6, అనుకున్నంతా అయింది, వైసీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డిని నెల్లూరు పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన జలదీక్షపై ముందునుంచీ అనుమానాలున్నాయి. పోలీసులు జలదీక్షకు అనుమతి ఇవ్వలేదు, ఆయన మాత్రం చేస్తానంటున్నారు. ఈ దశలో అసలు దీక్ష జరుగుతుందా లేదా అని అనుకున్నారంతా. చివరకు పోలీసులు అరెస్ట్ చేసి ఆయన్ను ఇల్లు కదలనివ్వలేదు. దీంతో నెల్లూరు రూరల్ లో కోటంరెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో పొట్టేపాలెం కలుజు వద్ద బ్రిడ్జ్ నిర్మాణం కోసం ఈరోజు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జలదీక్ష చేపట్టాల్సి ఉంది. దీనికోసం ముందుగానే ఏర్పాట్లు జరిగాయి. అయితే పోలీసులు మాత్రం అనుమతి ఇవ్వలేదు. రద్దీ రూట్ లో జలదీక్ష చేపడితే ట్రాఫిక్ కి ఇబ్బంది ఎదురవుతుందనే ఉద్దేశంతో వారు అనుమతివ్వలేదని అంటున్నారు. అయితే ఎమ్మెల్యే మాత్రం జలదీక్ష చేయాల్సిందేనన్నారు. దీనికోసం ఈరోజు ఉదయం సమాయత్తమవుతుండగా పోలీసులు ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. వైసీపీ పెద్దల సూచనతోనే తనను అరెస్ట్ చేసినట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే కోటంరెడ్డి, ఆయన హౌస్ అరెస్ట్ ను సోదరుడు, టీడీపీ నేత గిరిధర్ రెడ్డి కూడా ఖండించారు. కోటంరెడ్డి ఇల్లు, ఆఫీస్ వద్దకు అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళన చేపట్టారు..వైసీపీకి దూరం జరిగిన తర్వాత కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన కార్యాచరణ ప్రకటించారు. నెల్లూరులో బారాషహీద్ దర్గా అభివృద్ధి పనులకోసం ముస్లింలతో కలసి ఆందోళన చేపట్టాలనుకున్నారు, కలెక్టరేట్ వద్ద నిరసన కూడా ప్లాన్ చేసుకున్నారు. ఆ తర్వాత నెల్లూరు రూరల్ లో రోడ్ల సమస్యలు, బ్రిడ్జ్ సమస్యల పరిష్కారం కోసం ఆర్ అండ్ బి ఆఫీస్ ముందు ధర్నా చేస్తానన్నారు.

# ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు







కర్నూలు ఏప్రిల్ 6:- ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు.గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం నుంచి ప్రారంభించిన సందర్భంగా కర్నూలు జిల్లాలో పత్తికొండ డివిజన్, దేవనకొండ మండలం, పి. కోటకొండ గ్రామం నుండి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గారు,జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు గారు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా వైద్య సేవలను అందించడం జరుగుతోందన్నారు. మంచానికే పరిమితమైన రోగులకు సైతం గడప వద్దకే వెళ్ళి వైద్యం అందించడం జరుగుతుందన్నారు.. జిల్లాలోని ప్రతి మండలానికి కనీసం రెండు పీహెచ్సీలు, ప్రతి పీహెచ్సీలో ఇద్దరు డాక్టర్లు ఉంటారని, ఒక డాక్టర్ పీహెచ్సీ లో ఉంటే మరొక 104 వాహనానికి అనుసంధానముగా వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించి వైద్యం అందిస్తారని తెలిపారు..ఆరోగ్య శ్రీ, ఆస్పత్రుల అభివృద్ధి, ఫ్యామిలీ డాక్టర్ తదితర కార్యక్రమాల ద్వారా ముఖ్యమంత్రి వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు.నాలుగేళ్లలో వైద్య, ఆరోగ్య రంగంలో అనేక సంస్క రణలు తీసుకొచ్చి, పేదవారి ఆరోగ్య భద్రత కోసం ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారన్నారు. ప్రతీ గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ స్థాపించి, ఆయా సచివాలయాలకు అనుసంధానించడం ద్వారా పనిచే సేలా చర్యలు తీసుకున్నారని వివరించారు.జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మెరుగైన వైద్యం కొరకు వారి ఇంటి ముంగిట అమలు అవుతున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, బిపి, షుగర్, గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి అసంక్రమిత వ్యాధిగ్రస్తులకు చికిత్స రెగ్యులర్ గా ఫాలోఅప్ మరియు నివారణ ఆరోగ్య సేవలును అందజేయడం ద్వారా వ్యాధి తీవ్రత దాల్చకుండా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 25 మండలాలకు నలభై ఒక్క 104 వాహనాల ద్వారా 15 రోజులకు ఒకసారి ఫ్యామిలీ డాక్టర్ గ్రామాలకు వెళ్ళి ఆరోగ్య సంబంధిత పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన మందులు కూడా అందిస్తారన్నారు.. గ్రామాల్లో అనారోగ్యంతో ఉన్నవారిని, గర్భవతులను, పాఠశాలల పిల్లలను గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించాలని డాక్టర్లను కోరారు. కాన్పుసమయంలో తల్లులను కాపాడే విధంగా వైద్య పరమైన పరీక్షలు నిర్వహించాలని డాక్టర్లకు సూచించారు..ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన 104 నూతన వాహనాన్ని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి,కలెక్టర్ ప్రారంభించి అంబులెన్స్ వాహనంలోని వసతులను పరిశీలించారు.అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీల స్త్రీలకు సీమంతము కార్యక్రమాలు నిర్వహించారు.మంత్రి, కలెక్టర్ వారిని ఆశీర్వదించారు..కార్యక్రమంలో వైద్య శాఖ అధికారులు, డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళలకు మంచి చేసే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చూడాలి ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి



## - అక్కాచెల్లమ్మలందరికి మంచి,మేలు జరిగితే వైయస్సార్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి..ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి







గోస్పాడు ఏప్రిల్ 6 ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వైసిపి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన అందరికి నవరత్నాలను ప్రవేశపెట్టి సంక్షేమ పథకాల ద్వారా అనేక మేల్లను చేశామని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. అక్కాచెల్లెమ్మలందరికి మేము మంచి చేశామని మనస్ఫూర్తిగా తలంచితే మమల్ని, వైఎస్సార్ పార్టీని, మా నాయకులను, నన్ను మర్చిపోవద్దని, వచ్చే ఎన్నికల్లో నా అక్కాచెల్లెమ్మలందరి మద్దతు సంపూర్ణంగా ఉంటుందని, మహిళలపై పూర్తి భరోసా, నమ్మకం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలంలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. గోస్పాడు మండల పరిదిలో ఇప్పటికి పొదుపు లక్ష్మి అక్కాచెల్లెమ్మలకు 16కోట్ల93లక్షల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. మంచి మేలు చేసే ప్రభుత్వాన్ని, సీఎంను, ఎమ్మెల్యేలను, ఎంపీలను మీరంతా మర్చిపోవద్దని, భవిషత్తులో జరుగనున్న ఎన్నికల్లో మీ అందరి ఆశిస్సులు, మద్దతు అందించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేద,బడుగు,బలహీన, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి,ఆర్థిక భరోసాను కల్పిస్తూ అధికారం చేపట్టిన నాటి నుండి నేటి వరకు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని,వాగ్దానాలను తూచాతప్పకుండా. అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. మంచి పనులు చేసే వైఎస్సార్సీపీ ప్రభుత్వాన్ని అక్కాచెల్లెమ్మలు అండగా నిలవాలని, తమను మరచిపోవద్దని కోరారు. మీకు మంచి చేశామన్న నమ్మకం ఉంది కాబట్టే ధైర్యంగా మీముందుకు వచ్చి మీ ఆశీర్వాదాలు, మద్దతు అడుగుతున్నామన్నారు. టీడీపీ వారి మోసపూరిత మాటలు, కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోయారో మళ్లీ పాతరోజులు పునరావృతం అవుతాయని, రాష్ట్ర అభివృద్ధి తిరోగమనంలోకి నెట్టబడుతుందన్నారు. ముఖ్యమంత్రి మహిళలకే సంక్షేమ పథకాల్లో అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని, పెద్దపీట వేశారన్నారు. రానున్న ఏడాదిలో నాలుగవ విడత రుణమాఫీ తప్పకుండా చేస్తామని తెలిపారు. అంతే కాకుండా సవరత్నాల్లోని అన్ని పథకాలను, అదనంగా చెప్పని అనేక పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. నిజాయితీగా, మీ కోసం, మీ కుటుంబం కోసం పనిచేస్తున్నామని, చేస్తామని తెలియజేశారు.మీ కోసం మేము పడుతున్న కష్టాన్ని గుర్తించాలని కోరారు. గోస్పాడులో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. అక్కాచెల్లెమ్మలకు చేసిన అన్ని మేల్లకు ముఖ్యమంత్రికి నియోజకవర్గం ప్రజల తరుపున ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, గోస్పాడు మండల ఎంపీపీ ఆర్థర్ సైమన్, వైఎస్సార్సీపీ గోస్పాడు మండల కన్వీనర్ పీపీ రాజశేఖర్ రెడ్డి,రాష్ట్ర సోషల్ మీడియా కో ఆర్డినేటర్ పీపీ మధుసూధన్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డి, శ్రీనివాసరెడ్డి,భాస్కర్ రెడ్డి ,బెక్కెం నాగేశ్వరరెడ్డి,వైఎస్సార్సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శకుంతలమ్మ,ఎంపీడీఓ సుగుణశ్రీ,మహిళలు పాల్గొన్నారు.

# అన్నయ్య డిసైడ్ అయ్యేది అప్పుడే!

గతేడాది మెగాస్టార్ చిరంజీవి ఏకంగా రెండు సినిమాలో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. 'ఆచార్య'..'గాడ్ పాదర్' తో థియేటర్లో సందడి చేసారు. ఈ రెండు సినిమాలు సైమల్టేనియస్ గా చేసారు. 'ఆచార్య' సెట్ లో ఉండగానే 'గాడ్ ఫాదర్' ని లైన్ లోకి తేవడం...'ఆచార్య' ముగించి గ్యాప్ లేకుండా గాడ్ పార్ ని సెట్స్ లో బిజీ అవ్వడం జరిగింది. అదే సమయంలో 'వాల్తేరు వీరయ్య' తెరపైకి తేవడం..రిలీజ్ చేయడం వంటిని అన్ని చకచకా జరిగిపోయాయి.అన్నయ్యలో ఈ వేగాన్ని చూసి అంతా షాక్ అయ్యారు. స్టార్ హీరో ఏడాదికి ఒక సినిమా రిలీజ్ చేయడమే కష్టం. అలాంటిది మెగాస్టార్



ఏకంగా రెండు సినిమాలతో వచ్చేసరికి ఆయన వయసు పెరుగుతుందా? తగ్గుతుందా? అన్న సందేహం సైతం తెరపైకి వచ్చింది. మరి వీటి ఫలితాలు అన్నయ్యలో ఆ వేగాన్ని తగ్గించాయా? అంటే అవుననే అనిపిస్తుంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన 'ఆచార్య' భంగపడింది.'గాడ్ పాదర్' తోనైనా లెక్కలు సరి చేస్తారంటే బాక్సాఫీస్ వద్ద అదీ అంచనాలు అందుకోలేదు. ఈ రెండు సినిమా లెక్కల్ని 'వాల్తేరు వీరయ్య' మాత్రం సరి చేసింది. ప్రస్తుతం మెహర్ రమేష్ దర్శకత్వం 'భోళా శంకర్' చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. అన్ని పనులు పూర్తిచేసి ఆగస్టులో రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సినిమా ఏంటి? అంటే మెగా కాంపౌండ్ నుంచి ఎలాంటి కబురు వినిపించలేదు.అలాగని చిరంజీవి ఖాళీగానూ లేరు. చిత్రీకరణ అనంతరం ఖాళీ సమయంలో వరుసగా కథలు వినే కార్యక్రమం నడుస్తుంది. ఇప్పటికే సీనియర్ దర్శకుల నుంచి జూనియర్స్ వరకూ చాలా మంది చిరుకి కథలు చెప్పారు. అయితే వాటిలో ఎన్నింటికి ఎస్ చెప్పారు? ఎన్నింటిని రిజెక్ట్ చేసారు? అన్నది క్లారిటీ లేదు. మరోవైపు కథలు వింటున్నా? ఏ కారణంగా నచ్చిన కథల్ని రివీల్చేయడం లేదంటూ! చర్చా సాగుతుంది.అయితే వీటన్నింటి పై క్లారిటీ రావాలంటే 'భోళా శంకర్' రిలీజ్ తర్వాతే అని తెలుస్తుంది. అప్పటి వరకూ చిరు మీడియాకి ఎలాంటి లీకు ఇచ్చే అవకాశం లేదు. ఈ మధ్య కాంలో చిరంజీవి పబ్లిక్ గానే కొన్ని విషయాలు చెప్పేస్తున్నారు. గతంలో చరణ్ సినిమాల విషయంలో ఇలాగే చేసారు. తన సొంత సినిమాలకు సంబంధించి ఇలాంటి కొన్ని ప్రకటనలున్నాయి. వాటి వల్ల మంచికి బధులు చెడే ఎదురైందని మెగా వర్గం విశ్వషిస్తుందిట. ఈ నేపథ్యంలో లోలోపల ఎలాంటి కమిట్ మెంట్లు జరిగినా చిరు ఓపెన్ అవ్వడం లేదని టాక్.

# ఎన్టీఆర్30 కోసం బాడీ షేప్ కొత్తగా ట్రై చేస్తున్నాడట

'ఆర్ఆర్ఆర్' తో పాన్ వరల్డ్ గుర్తింపు దక్కించుకున్న ఎన్టీఆర్ తదుపరి సినిమా షూటింగ్ ను ఎప్పుడెప్పుడు మొదలు పెడుతాడో అంటూ అభిమానులు



మరియు ప్రేక్షకులు ఎంతో ఆసక్తి గా ఎదురు చూశారు. ఎట్టకేలకు ఎన్టీఆర్ 30 సినిమా రెగ్యులర్ షూటింగ్ కార్యక్రమాలు ప్రారంభం అయినట్లుగా సినీ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. ప్రస్తుతం యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారట.కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కార్యక్రమాలు ప్రారంభం అవ్వడంతో పాటు ఈ సినిమా లో విభిన్నమైన లుక్ లో కనిపించడం కోసం మరియు యాక్షన్ సన్నివేశాల్లో మరింత వేగంగా కదిలేందుకు గాను ఎన్టీఆర్ ప్రత్యేకమైన ఫిజికల్ ట్రైనింగ్ తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.ఆర్ఆర్ఆర్ సినిమా కోసం ఎన్టీఆర్ కాస్త బరువు పెరిగారు. ఆ బరువు తగ్గిన ఎన్టీఆర్ తన ఫిజిక్ ను అదే విధంగా మెయింటెన్ చేయడం తో పాటు యాక్షన్ సన్నివేశాల విషయంలో గతంతో పోల్చితే కొత్తగా ఉండేలా ప్లాన్ చేసిన ఎన్టీఆర్ ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంటున్నట్లుగా సమాచారం అందుతోంది.ఎన్టీఆర్ ప్రస్తుతం పాల్గొంటున్న షెడ్యూల్ లో భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. తదుపరి షెడ్యూల్ లో జాన్వీ కపూర్ జాయిన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ సమాచారం అందుతోంది. ఎన్టీఆర్ మరియు కొరటాల శివ కాంబోలో గతంలో వచ్చిన జనతా గ్యారేజ్ కు ఏమాత్రం తగ్గకుండా భారీ విజయాన్ని సొంతం చేసుకునే విధంగా ఈ సినిమా ఉండాలనే ఉద్దేశ్యంతో దర్శకుడు కొరటాల శివ ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది.

# దసరా దెబ్బ పడకూడదని నాని భయం!

న్యాచురల్ స్టార్ నాని హీరోగా ఇటీవలే నటించిన చిత్రం దసరా. శ్రీరామ నవమి సందర్భంగా మార్చి 30వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా సూపర్ హిట్టుగా నిలిచింది. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం విజయంతో నాని చాలా హ్యాపీగా ఉన్నారు. ఈ సినిమా విజయంపై తన ఆనందాన్ని పంచుకోవడానికి నేచురల్ స్టార్ ఈరోజు తెలుగు సినిమా మీడియాతో సమావేశమయ్యారు.తన సినిమాకు సంబంధించిన విషయాలపై చిట్ చాట్



నిర్వహించారు. ఈ క్రమంలోనే పలు అంశాల గురించి మాట్లాడారు. ముఖ్యంగా ఒక్కో సినిమాకు ఒక్కో జానర్ని బట్టి ఒక్కో టార్గెట్ ఉంటుందని అన్నారు. ఒక సినిమా బాక్సాఫీస్ పని తీరును మరో సినిమాతో పోల్చుకోవాల్సిన అవసరం లేదని నాని వివరించారు. అలాగే సూపర్ డూపర్ హిట్లుగా నిలిచిన ఎంసీఏ జెర్సీ చిత్రాలను ఒకదానితో ఒకటి పోల్చలేమన్నారు.ఎంసీఏ మాస్ చిత్రం కాగా... జెర్సీ ఒక స్పోర్ట్స్ డ్రామా చిత్రం అని నాని వివరించారు. అయితే ఈ రెండు చిత్రాలు తమదైన స్టైల్ లో హిట్టుగా నిలిచాయని వివరించారు. అలాగే తన రాబోయే చిత్రాన్ని దసరా సినిమాతో పోల్చకూడదని చెప్పారు. నాని30ని ఒక్క దసరాతోనే కాకుండా మరేదైనా మాస్ ఎంటర్ టైనర్ సినిమాతో కూడా పోల్చొద్దని నాని అందరినీ కోరారు.అయితే నాని 30 ఒక అందమైనచిత్రం అని అది ఖచ్చితంగా దాని లక్ష్యాన్ని చేరుకుంటుందని అన్నారు. నాని చెప్పిన దాన్ని బట్టి చూస్తే దసరా ప్రభావం పడితే మళ్ళీ దారుణంగా దెబ్బ పడే ఛాన్స్ ఉందని లోలోపల ఒక అనుమానం మొదలైనట్లు అనిపిస్తోంది. అందుకే తరువాత చిత్రం మాస్ చిత్రం కాదు కాబట్టి ఎవరూ దాన్ని మాస్ చిత్రాలతో కానీ.. తన గత చిత్రాలతో కానీ పోల్చొద్దని పదేపదే కోరారు. డిఫరెంట్ ఎమోషన్స్తో కూడిన సినిమా ఇది అంటూ చెప్పుకొచ్చారు. నాని 30వ చిత్రానికి నూతన డైరెక్టర్ శౌర్యువ్ దర్శకత్వం వహించబోతున్నారు.మృనాల్ ఠాకూర్ ఈ చిత్రంలో హీరోయిన్ గా నటించబోతోంది. అంతేకాదండోయ్ ఈ చిత్రం హక్కులకు ఏకంగా 35 కోట్ల రూపాయల ఆఫర్ వచ్చినట్లు సమాచారం. సినిమా ప్రారంభం కాకముందే ఈ రేంజ్ లో ఆఫర్ వస్తే.. థియేటర్ హక్కులు ఏ రేంజ్ లో కొనుగోలు జరుగుతుందోనని అంతా అనుకుంటున్నారు.

# డబ్ల్యూటీసీ ఫైనల్‌కు శ్రేయస్ అయ్యర్ దూరం.. టీమిండియాలోకి ఆంధ్ర ఆటగాడు




టీమిండియా వెటరన్ ఆటగాడు, ఆంధ్రా క్రికెట్ జట్టు కెప్టెన్ హనుమ విహారి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా బీసీసీఐ 2023-24 గాను ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో హనుమ విహారికి చోటు దక్కలేదు.దీంతో అతడు మళ్లీ భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడం దాదాపు కష్టమని అంతా భావించారు. కానీ విహారి మళ్లీ భారత జట్టులోకి పునరాగమనం చేసే ఇంకా దారులు మూసుకుపోలేదు.ఆస్ట్రేలియాతో జరగనున్న వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు భారత జట్టులో హనుమ విహారికి చోటు దక్కనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు వెన్ను గాయం కారణంగా దూరమైన శ్రేయస్ అయ్యర్ స్థానంలో విహారి ఎంపిక చేయాలని భారత సెలక్టర్లు యోచిస్తున్నట్లు సమాచారం. కాగా విహారీ దేశీవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు.రంజీ ట్రోఫీ 2022-23 సీజన్‌లో విహారి అదరగొట్టాడు. ఈ క్రమంలోనే అతడికి మళ్లీ పిలుపునివ్వాలని సెలక్టర్లు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కాగా గతంలో కూడా టీమిండియా తరుపున ఎన్నో విరోచిత ఇన్నింగ్స్‌లు ఈ ఆంధ్రా కెప్టెన్ ఆడాడు. లండన్ వంటి స్వింగ్ పిచ్‌లపై అద్భుతంగా ఆడే సత్తా హనుమ విహారికి ఉంది.ఇక ఇదే విషయంపై బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు స్పందిస్తూ.. "శ్రేయస్ అయ్యర్ మా జట్టులో చాలా కీలమైన ఆటగాడు. అతడు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దూరం మాకు పెద్ద ఎదురుదెబ్బ అనడంలో ఎటువంటి సందేహం లేదు. అతడు చాలా అనుభవజ్ఞుడైన ఆటగాడు. గతంలో ఆస్ట్రేలియా వంటి పిచ్‌లపై అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవం కూడా



అయ్యర్‌కు ఉంది. అతడి స్థానాన్ని మరో అనుభవజ్ఞుడైన ఆటగాడితో భర్తీ చేయాలని భావిస్తున్నాము.మా సెలక్టర్లు హనుమ విహారి పేరును పరిశీలిస్తున్నారు. మే మొదటి వారంలో జరగనున్న సెలక్షన్ మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకుంటారని" పేర్కొన్నారు. కాగా విహారి చివరగా భారత్ తరపున గతేడాది ఇంగ్లండ్‌పై ఆడాడు. అప్పటి నుంచి అతడు జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190